సాక్షి అనంతపురం

సోమవారం ♦ 18 ♦ ఆగస్టు ♦ 2025



కమనీయం.. రథోత్సవం

బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. 8లో



టమాట కిలో రూ.42

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.42 పలికింది. కనిష్టం రూ.32, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

30.5°/21.3°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. అర్జీ స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీలను పరిష్కార వేదికలోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ సూచించారు.

నేడు విధుల్లోకి కలెక్టర్



అనంతపురం అర్బన్: కలెక్టర్ వినోద్ కుమార్ సోమవారం విధుల్లోకి చేరనున్నారు. ఐఏఎస్ అధికారులకు ఇచ్చే మిడిల్ కెరీర్ ట్రైనింగ్ ముగించుకున్న ఆయన ఆదివారం అర్ధరాత్రికి జిల్లాకు చేరుకున్నారు. గత నెల 21వ తేదీ నుంచి ఈనెల 16 వరకు ముస్సోరిలో శిక్షణ తీసుకున్నారు. 26 రోజుల తరువాత విధులకు హాజరుకానున్నారు.

16 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాపై వరుణుడి ప్రభావం కొనసాగుతోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 16 మండలాల పరిధిలో 4.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఆదివారం పగలంతా ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. తాడిపత్రి 62.4 మి.మీ, యాడికి 17.2, వజ్రకరూరు 12.2, గుత్తి 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 150.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఓవరాల్‌గా జూన్ 1 నుంచి 165.5 మి.మీ గానూ 41 శాతం అధికంగా 233.4 మి.మీ వర్షం కురిసింది. 16 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. 24 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా, మిగతా 7 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

సెల్‌ఫోన్ కోసం భార్యతో గొడవ.. యువకుడి ఆత్మహత్య

చిలమత్తూరు: సెల్‌ఫోన్ కోసం భార్యతో గొడవ పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఝార్ఖండ్‌కు చెందిన ఆనంద్ సర్దార్ (20) బతుకు తెరువు కోసం వలస వచ్చి చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి పంచాయతీ పరిధిలోని యగ్నిశెట్టిపల్లి వద్ద ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సెల్‌ఫోన్ కొనుగోలు విషయంలో శనివారం రాత్రి భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చి నేరుగా తాను పనిచేస్తున్న పౌల్ట్రీఫారం ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుంతకల్లులో తళుక్కుమన్న అనసూయ



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న అనసూయ

గుంతకల్లు: ప్రముఖ యాంకర్, సినీ నటి అనసూయ భరద్వాజ్ ఆదివారం గుంతకల్లులో తళుక్కుమన్నారు. పట్టణంలో ఓ ప్రైవేట్ దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమెతో పాటు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా అనసూయను చూసేందుకు అభిమానులు, పట్టణ ప్రజలు ఎగబడ్డారు. ఆమెతో ఫొటోలు, సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో ఆమె ఓ సినీ గీతానికి స్టెప్పులు వేసి యువతను ఉత్తేజ పరిచారు. డీఎస్పీ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యూరియా... ఏదయా

బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ ఆర్‌ఎస్‌కే వద్ద ఆదివారం యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు వీరు. నిల్చునే ఓపిక లేక చాలా మంది ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలను లైన్‌గా ఉంచారు. యూరియా లోడ్ వస్తుందని తెలియడంతో పిల్లాజెల్లా అంతా ఉదయాన్నే క్యూ కట్టారు. వర్షం పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో గంటల పాటు ఎదురుచూశారు. అధికారులేమో స్టాకు ఉన్నంత వరకే పంపిణీ చేసి చేతులెత్తేశారు. దీంతో చాలామంది రైతులు ఉత్తచేతులతో నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. ఇక్కడొక్కటే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు యూరియా కోసం కష్టాలను ఎదుర్కొంటున్నారు.



- రైతుల అవసరాలపై కూటమి ప్రభుత్వం అలసత్వం
- ఎరువుల సరఫరాలో విఫలం
- యూరియా బస్తాలను తన్నుకుపోతున్న 'పచ్చ' నేతలు
- అన్నదాతల పడరాని పాట్లు

బొమ్మనహాళ్: రైతులకు సరిపడా ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రైతులు వరి, మొక్కజొన్న, వేరుశనగ, కంది, పత్తి, మిరప, టమాట తదితర పంటలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా హెచ్చెల్సీ ఆయకట్టు కింద బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో వ్యవసాయ బోర్ల కింద ఎక్కువగా వరి సాగు చేశారు. ఈ క్రమంలో ఎరువుల అవసరం చాలా ఉంటుంది. అందుకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది.

కృత్రిమ కొరత..

జిల్లాలోని 31 మండలాల్లో జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు కలిపి 26,839 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు గుర్తించారు. ఆ దిశగా ఇప్పటి వరకు 28 వేల మెట్రిక్ టన్నులు అదనంగా సరఫరా చేసినట్లు లెక్కలు చూపుతున్నారు. ఈ స్థాయిలో యూరియా చేర్చి ఉంటే కొరత అన్న మాట వినిపించేదే కాదు. అయితే, డీలర్ల వద్దే నిల్వ చేసుకొని రైతులకు విక్రయించినట్లు లెక్కలు చూపి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే క్రమంలో తమను ఆశ్రయిస్తున్న రైతులకు వ్యాపారులు యూరియాతో పాటు ఇతర ఎరువులు కట్టబెడుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో అన్నదాతల కష్టాలు చెప్పనలవిగా మారాయి.



యూరియా కోసం ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలు వరుసలో ఉంచిన దృశ్యం

కూటమి నాయకులకు ఫుల్.. రైతులకు నిల్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ యూరియా దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. 'పచ్చ' పార్టీ నాయకులకు మాత్రం యూరియా ఫుల్‌గా లభిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు సేవా కేంద్రాలకు అరకొరగా వచ్చిన బస్తాలను నాయకులే మొత్తం తీసుకెళ్తున్నట్లు తెలిసింది. అనంతరం రూ.270 పలికే బస్తాను బయటి మార్కెట్‌లో రూ. 350 వరకూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా ఈ దందా జరుగుతున్నా వ్యవసాయాధికారులు వారిని ప్రశ్నించే ధైర్యం చేయడం లేదు.

యూరియా దొరకడం లేదు



15 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నా. ఇప్పటికే నాట్లు కూడా వేశాం. పంట ఎదుగుదలకు యూరియా ఎంతో అవసరం. ఉద్దేహాళ్ సహకార సొసైటీ, ఆర్‌ఎస్‌కే చుట్టూ తిరిగినా యూరియా దొరకలేదు. ఉపయోగపడని సంఘాలెన్ని ఉంటే ఏం చేస్తాం. రైతులకు ఎరువులు కూడా సరఫరా చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది.– సిరేకోళం రుద్రప్ప, రైతు, బొమ్మనహాళ్ మండలం

ఎదురుచూసి అలసిపోతున్నాం



20 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నా. ఒక ఆధార్ కార్డుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తున్నారు. మా గ్రామంలో యూరియా లోడ్ వచ్చినప్పుడల్లా ఉదయం నుంచి క్యూలో నిలబడితే మధ్యాహ్నం కల్లా అయిపోయిందని చెప్పి వెనక్కి పంపుతున్నారు. యూరియా కోసం ఎదురు చూసి అలసిపోతున్నాం. – బసప్ప, రైతు, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

ఉద్యమబాట తప్పదు



రైతులకు సకాలంలో ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. యూరియా కోసం అన్నదాతలు సొసైటీలు, ఆర్‌ఎస్‌కేల వద్ద బారులు తీరుతున్నారు. కూటమి ప్రభుత్వానికి ముందు చూపులేదు. రైతులకు సరిపడా ఎరువులను వెంటనే సరఫరా చేయాలి. లేకపోతే ఉద్యమ బాట పట్టాల్సి ఉంటుంది. – మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

ఒక రైతుకు రెండు బస్తాలు



అవసరం ఉన్న ప్రతి రైతుకూ యూరియా బస్తాలను అందిస్తాం. జిల్లా వ్యవసాయాధికారుల ఆదేశాల మేరకు ఎరువుల కొరత రానీయకుండా చర్యలు చేపట్టాం. బొమ్మనహాళ్ మండలానికి 75.6 మెట్రిక్ టన్నులు వచ్చాయి. ఒక రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్

తాడిపత్రిలో ఉత్కంఠ

- నేడు పట్టణానికి కేతిరెడ్డి పెద్దారెడ్డి
- అడ్డుకునేందుకు జేసీ కుయుక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు



తాడిపత్రిటౌన్: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం తాడిపత్రికి వస్తున్న నేపథ్యంలో అంతటా ఉత్కంఠ నెలకొంది. ఆయన్ను అడ్డుకునేందుకు టీడీపీ నాయకుడు, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కుట్రలకు తెరతీయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగు పెట్టకుండా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్న సంగతి తెలిసిందే. శాంతిభద్రతల పేరుతో పోలీసులను అడ్డుపెట్టి మాజీ ఎమ్మెల్యేకు అడ్డు తగులుతున్నారు. దీంతో పెద్దారెడ్డి పలుమార్లు కోర్టు మెట్లెక్కారు. పట్టణానికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు అనుమతినిచ్చింది. ఆయనకు పోలీసులు తగిన భద్రత కల్పించాలని కూడా ఆదేశించడం గమనార్హం.

అడ్డుకునేందుకు జేసీ కుయుక్తులు..

పెద్దారెడ్డి తాడిపత్రి వస్తారని తెలుసుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన్ను అడ్డుకోవడానికి మరోసారి కుయుక్తులకు తెరతీశారు. ఈ క్రమంలో ఏకంగా దేవుడి పేరుతో రాజకీయాలకు తెరలేపడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. సోమవారం తాడిపత్రి– అనంతపురం ప్రధాన రహదారిలోని రైల్వే బ్రిడ్జ్ వద్ద శివుడి విగ్రహావిష్కరణ ఉంటుందని, ఇందుకు పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు రావాలని జేసీ పిలుపునివ్వడం గమనార్హం. విగ్రహావిష్కరణ అనంతరం మరో కార్యక్రమానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని వాట్సాప్ గ్రూపుల్లో జేసీ అనుచరులు ప్రకటనలు చేయడం కలకలం రేపుతోంది. ఈ క్రమంలో తాడిపత్రి వాసుల్లో భయాందోళన నెలకొంది.

భారీ బందోబస్తు..

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి రాక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల కదలికలపై గట్టి నిఘా ఉంచారు. దాదాపు 400 మంది ప్రత్యేక పోలీస్ బలగాలతో పట్టణంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

ప్రత్యామ్నాయం.. ఇంకెంత ఆలస్యం!

- 1.50 లక్షల హెక్టార్లు బీడు భూములుగా దర్శనం
- గతితప్పిన వర్షాలతో ఖరీఫ్ పంటల సాగుకు అవరోధం
- ప్రత్యామ్నాయంపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం



అనంతపురం అగ్రికల్చర్: గతి తప్పిన వర్షాలతో ఖరీఫ్‌లో పంటల సాగు పడకేసింది. జూన్ 15 నుంచి ఆగస్టు 5 వరకు అంటే 55 రోజుల పాటు వరుణుడు మొహం చాటేయడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అడపాదడపా కురిసిన అరకొర వర్షాలకే రైతులు ఖరీఫ్ కింద పంటలు సాగు చేశారు. వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు విత్తుకునే గడువు జూలై నెలాఖరుతోనే ముగిసింది. 3.42 లక్షల హెక్టార్లు అంచనా వేయగా.. సరైన వర్షాలు కురవకపోవడంతో ప్రస్తుతానికి 1.90 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేసినట్లు వెల్లడైంది. దీన్ని బట్టి ఇంకా 1.52 లక్షల హెక్టార్లు పంటలు లేక బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.

కీలక సమయంలో వర్షాభావం..

పంటలు విత్తుకునేందుకు కీలక సమయమైన జూన్ ఒకటి నుంచి ఆగస్టు 5 వరకు అంటే దాదాపు 65 రోజుల్లో 130 మి.మీ గానూ 37 శాతం తక్కువగా 82.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రధానంగా జూలైలో 64.3 మి.మీ గానూ కేవలం 34.7 మి.మీ వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ సాగుకు అవరోధంగా మారింది. అయితే ఆగస్టు 5 నుంచి... గత 12 రోజుల్లోనే పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. విరామం లేకుండా వర్షాలు పడుతుండటంతో ఒక్కసారిగా 37 శాతం లోటు నుంచి 40 శాతం అధిక వర్షపాతానికి చేరుకోవడం విశేషం.

'ప్రత్యామ్నాయం' చూపని కూటమి:

ప్రధాన పంటల సాగుకు గడువు ముగిసిపోవడంతో ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాల్సి ఉంది. అయితే కూటమి సర్కారు 'ప్రత్యామ్నాయం' చూపే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి అసలు ప్రతిపాదనలు పంపకపోవడం చూస్తే రైతులకు విత్తనాలు ఇచ్చే ఆలోచన చంద్రబాబు సర్కారు లేదని తెలుస్తోంది. సాధారణంగా ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమైన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా, లేదంటే 80 శాతం రాయితీతో ఉలవ, పెసర, అలసంద లాంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు వీలుగా ఆగస్టు మూడో వారంలో విత్తనాలు ఇచ్చేది. కానీ ఈ సారి అలాంటి సన్నాహకాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. అదే జరిగితే ఈ సారి 1.50 లక్షల హెక్టార్లు క్రాప్ హాలిడే కింద చేరే పరిస్థితి నెలకొంది. ఏ పంట వేసుకోవాలో అర్థం కాక రైతులు అయోమయంలో ఉన్నా కూటమి సర్కారు కానీ, వ్యవసాయశాఖ కానీ నోరుమెదపడం లేదు.

13 మండలాల్లో మోస్తరు..

కేవలం 13 మండలాల్లో మోస్తరుగా పంటలు సాగులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ నివేదిక వెల్లడిస్తోంది. అందులో ఆశ్చర్యకరంగా వజ్రకరూరు మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 18,716 హెక్టార్లు కాగా ఇప్పటికే 125 శాతంతో ఏకంగా 23,335 హెక్టార్లలో పంటలు సాగు చేయడం విశేషం. ఆ తర్వాత గుంతకల్లులో 94 శాతంతో 17,050 హెక్టార్లు, కణేకల్లులో 73 శాతంతో 11,150, గుత్తిలో 71 శాతంతో 10,536, కళ్యాణదుర్గంలో 67 శాతంతో 11,298 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. పుట్లూరు, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, నార్పల, గుమ్మఘట్ట, గార్లదిన్నె, యల్లనూరు, విడపనకల్లు, తాడిపత్రి తదితర 10 మండలాల్లో 10 నుంచి 30 శాతం లోపు విస్తీర్ణంలో పంటలు వేయగా... ఇంకా పెద్ద ఎత్తున భూములు ఖాళీగా దర్శనమిస్తుండటం గమనార్హం.

కంది మినహా...

ఈ ఖరీఫ్‌లో కందిపంట మాత్రమే సాధారణం కన్నా ఎక్కువగా 132 శాతం విస్తీర్ణంలో సాగైంది. 55,296 హెక్టార్లకు గానూ 73,145 హెక్టార్లలో కంది వేశారు. ప్రధానపంటగా ఉన్న వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లకు గానూ 34 శాతంతో 61,186 హెక్టార్లకు పరిమితమైంది. మొక్కజొన్న 14,653 హెక్టార్లకు గానూ 13,670 హెక్టార్లు, పత్తి 44,001 హెక్టార్లకు గానూ 18,058, ఆముదం 16,293 హెక్టార్లకు గానూ 9,222, సజ్జ 3 వేల హెక్టార్లలో సాగులోకి వచ్చాయి. మిగతా పంటలు నామ మాత్రంగా వేశారు.

పీకల్లోతు కష్టాల్లో రైతాంగం

- అన్నదాతలను ఆదుకోవాలనే ఆలోచన బాబుకు లేదు
- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతాంగం పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందు నుంచి సీఎం చంద్రబాబు రైతు వ్యతిరేకి అని దుయ్యబట్టారు. ఆయన ఏనాడూ రైతాంగాన్ని ఆదుకోవాలనే ఆలోచన చేసిన పాపాన పోలేదన్నారు. దివంగత నేత వైఎస్సార్, ఆయన తనయుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతోనే దేశంలోనే అనంతపురం జిల్లా వ్యవసాయ రంగానికి గుర్తింపు లభించిందని, హార్టికల్చర్‌లో ప్రథమ స్థానం దక్కిందని గుర్తు చేశారు. తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న ప్రాంతంగానూ నిలిచిందన్నారు. 22 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారని, ప్రస్తుత పరిస్థితుల్లో అందులో 50 శాతం మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయని వాపోయారు. 19,466 హెక్టార్లలో సాగవ్వాల్సిన వరి 6,069 హెక్టార్లకు, 1,719 హెక్టార్లలో సాగులోకి రావాల్సిన జొన్నలు కేవలం 199 హెక్టార్లకే పరిమితమయ్యాయన్నారు. చిరుధాన్యాల సాగు భారీగా పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం నాసిరకమైన వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసి, విత్తనాలపై రైతులకు నమ్మకం పోయేలా చేసిందని విమర్శించారు. యాడికి మండలంలో రూ.2 కోట్ల విలువ చేసే పత్తి పంట దెబ్బతిందన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. కియా పరిశ్రమను తెచ్చామని ఓ ప్రజాప్రతినిధి చెబుతున్నారని, అందులో ఎన్ని ఉద్యోగాలు జిల్లా వాసులకు ఇచ్చారో చెప్పగలరా అని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు విత్తనం వేసినప్పటి నుంచి విక్రయించే వరకూ చేయూత అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.10,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాలసీ కారణంగా యూరియా దొరకడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దారుణ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయని తెలిపారు. రైతాంగాన్ని ఆదుకోకపోతే పోరాటాలకు సంసిద్ధమవుతామని స్పష్టం చేశారు.సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్, బండ్ల ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

'అనంత'లో మళ్లీ ఉగ్ర అలజడి

- ఉమ్మడి జిల్లాలో కలకలం సృష్టిస్తున్న ఉగ్రవాదుల కదలికలు
- గత ఏడాది రాయదుర్గంలో ఉగ్రవాది జాడను గుర్తించిన ఎన్ఐఏ
- తాజాగా ధర్మవరంలో టెర్రరిస్ట్ నూర్ అహమ్మద్ అరెస్ట్
- జిల్లాను 'ఉగ్ర' స్థావరంగా మార్చుకున్నారేమోనని సర్వత్రా అనుమానాలు

అనంతపురం: ఉగ్రవాద కదలికలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో భయాందోళనకు గురి చేస్తున్నాయి. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలతో ఫోన్ కాల్స్, వాట్సాప్ చాటింగ్ చేస్తూ యువతను ఉగ్రవాదులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్న ధర్మవరం పట్టణానికి చెందిన కే. నూర్ మహమ్మద్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు అరెస్ట్ చేశారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కలకలం రేగింది. పౌరుల ముసుగులో ఉంటూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుండడంతో ప్రజల్లో భయానక వాతావరణం నెలకొంది. జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అత్యంత పకడ్బందీగా ఐదు రోజుల కిందటే నూర్ మహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొబైల్ ఫోన్, సిమ్‌కార్డులు, ఉగ్రవాద ప్రేరేపిత పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అతనితో పాటు ధర్మవరం పట్టణంలోనే 'ఐ లవ్ పాకిస్తాన్' అంటూ ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్న ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంత మందికి ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

అనుమానం రాకుండా..

మెట్రో సిటీల్లోనే ఉగ్రవాదులు ఎక్కువగా పాగా వేస్తారు. కానీ ఇందుకు భిన్నంగా ప్రస్తుతం బెంగళూరు మెట్రో సిటీకి దగ్గరలోని పట్టణాల్లోనూ స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా హోటళ్లలో పనిచేసేవారు, ఆటో డ్రైవర్లు వంటి వారిని సులువుగా ముగ్గులో దింపుతున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద భావజాలం పట్ల ప్రేరేపించే ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అరెస్ట్ అయిన నూర్ మహమ్మద్ పలు ఉగ్రవాద సంస్థలకు చెందిన వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో కీలక సభ్యుడిగా ఉండడం గమనార్హం.

గతంలోనూ లింకులు..

2024 మే 22న జిల్లాలోని రాయదుర్గంలో విశ్రాంత హెచ్‌ఎం అబ్దుల్ సాహెబ్ నివాసంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు నిర్వహించింది. అబ్దుల్ సాహెబ్ కుమారుడు సుహేల్‌ను అదుపులో తీసుకుంది. సుహేల్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. కొన్నిరోజుల క్రితమే హైదరాబాద్‌కు మకాం మార్చిన సుహేల్ తరచూ బెంగళూరు వెళ్లి వచ్చేవాడు. రామేశ్వరం కేఫ్‌లో బాంబు బ్లాస్ట్ కేసులో ప్రధాన నిందితుడితో సుహేల్ వాట్సాప్ చాటింగ్ చేసినట్లు గుర్తించిన ఎన్ఐఏ అధికారులు.. ఇరువురి సంబంధాలపై మరింత లోతుగా విచారణ చేసేందుకు అరెస్ట్ చేశారు.



ఎన్ఐఏ ఆరా..

బెంగళూరు నగరానికి సమీపంలో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉగ్రవాదులతో సంబంధాలు కొనసాగిస్తున్న వారిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఆరా తీస్తోంది. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చి అనంతపురంలో ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా నివాసం ఉంటున్న వారి స్థితిగతులను పరిశీలిస్తున్నారు. నూర్ మహమ్మద్‌తో వాట్సాప్ గ్రూపుల్లో చాటింగ్ చేసిన వారి వివరాలపై కూపీ లాగుతున్నారు. ఇంటెలిజెన్స్ పోలీసులు అనంతపురం, రాయదుర్గం, కదిరి, ధర్మవరం, హిందూపురం పట్టణాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిసింది.

మొబైల్ రిపేరీపై శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: మొబైల్ ఫోన్ల రిపేరీపై ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నైపుణ్యతతో కూడిన శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు, 5వ తరగతి పాసైన వారు అర్హులు. 45 రోజుల శిక్షణా కాలంలో ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా టూల్‌కిట్ అందించి, వంద శాతం ఉపాధి దక్కేలా చర్యలు తీసుకుంటారు. మరిన్ని వివరాలకు ఆర్డీటీ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్‌లో కానీ, 88855 42201, 77807 52418 నంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చు.



తరగని అభిమానం: కట్టకిందపల్లిలో వైఎస్సార్ చిత్రపటాన్ని పెట్టుకుని పంట పనుల్లో నిమగ్నమైన కూలీలు



ప్రకృతి రమణీయం: ఉదయించే సూర్యుడి వెలుగుల్లో దేవరకొండ



శ్రమయేవ జయతే: అనంతపురంలోని హోటళ్లకు నీటిని సరఫరా చేస్తున్న మహిళ



ప్రకృతి తోరణం: గార్లదిన్నె - పెనకచెర్ల గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు

పదాలు అవసరం లేదు.. ఒక్క ఫొటో చాలు!

ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదులాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ ఫొటో చూడగానే నాటి స్మృతులు మనసులో మెదలుతాయి. సంతోషం.. బాధ.. మధుర ఘట్టాలు.. సాధించిన విజయాలు.. అద్భుత సన్నివేశాలు.. కాలానుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం ఒక్క ఫొటోతోనే సాధ్యం. మనసులోని భావాలను పలికించడానికి.. ప్రకృతి అందాలను బంధించడానికి.. హృదయాంతరాల్లోని ఆర్ద్రతను చూపించడానికి.. ప్రజల ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడానికి పదాలు అవసరం లేదు. ఒక్క చిత్రం చాలు. ఇలాంటి అద్భుతాన్ని ఆవిష్కరించిన లూయిస్ డాగురే జ్ఞాపకార్థం ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కొన్ని చిత్రాలు మీకోసం.. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సంధ్య వేళ: సూర్యాస్తమ సమయంలో ఇంటి దారి పట్టిన నగరవాసులు

హామీల అమలుకు పోరాటానికి సిద్ధం

- అంగన్‌వాడీలకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపు



మహాసభలో మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని అంగన్‌వాడీ వర్కర్లకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం 8వ జిల్లా మహాసభ ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షురాలు శంకుతల పాతక్క అధ్యక్షతన జరిగిన సభలకు ఓబులు, శ్రీదేవితో పాటు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి రమాదేవి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాసభలో ఉద్యమ కార్యాచరణపై తీర్మానాలు చేశారు.

వివాహితపై హత్యాయత్నం కేసులో భర్త అరెస్ట్

అనంతపురం: కట్టుకున్న భార్యనే చంపాలని ప్రయత్నం చేసిన భర్త కటకటాల పాలయ్యాడు. వివరాలను అనంతపురం వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం వెల్లడించారు. అనంతపురం నగరంలోని పవర్ ఆఫీసు వెనుక అంబేడ్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న ఖాజీ తస్లీమా నస్రీన్‌కు ఏడు నెలల క్రితం సంగమేష్ నగర్‌లోని బృహస్పతి పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న కె.రోషన్ జమీర్ ఖాన్‌తో వివాహమైంది. వీరిద్దరిదీ రెండో వివాహమే. పెద్దల సమక్షంలో పెళ్లి చేసే సమయంలో తస్లీమా నస్రీన్ తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, 12 తులాల బంగారు, రూ.1.50 లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను ఇచ్చారు. వివాహం జరిగినప్పటి నుంచి రోషన్ జమీర్ , అతని తల్లి షమీమ్ భాను, చెల్లెలు నౌజియా సుల్తానా, ఆమె భర్త సలీం, మేనమామ సాదిక్ వలి అందరూ కలిసి మరో రూ.10 లక్షలు కట్నం కింద తీసుకురావాలని ఒత్తిడి చేసేవారు. ఇందుకు నస్రీన్ ఒప్పుకోకపోవడంతో ఈ నెల 15న మోతాదుకు మించి టాబ్లెట్లను నీటిలో కలిపి బలవంతంగా నస్రీన్ నోట్లోకి రోషన్ జమీర్ పోసి నోరు అదిమి పెట్టాడు. తర్వాత అపస్మారక స్థితికి చేరుకున్న నస్రీన్‌ను పొరుగింటి వారు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త రోషన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేశారు.

కంటైనర్ - కారు ఢీ





గాయపడిన చిన్నారి, మహిళ

కూడేరు: మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం కంటైనర్, కారు ఢీకొన్నాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న మహేష్ ఆయన భార్య, కుమార్తె గాయపడ్డారు. విడపకల్లు మండలం గడేహోతురుకు చెందిన వీరు కారులో బెంగళూరుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

గుర్తు తెలియని మహిళ మృతి

బత్తలపల్లి: స్థానిక శివాలయం వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సోమశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మతిస్థిమితం సరిగా లేని సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ మహిళ నాగుల కట్ట మీద గత 20 రోజులుగా ఉండేది. చుట్టు పక్కల వారు ఆమెకు ఆహారం ఇచ్చి సౌకర్యాలు కల్పించేవారు. ఆదివారం ఉదయం ఆహారం ఇచ్చేందుకు వెళ్లినప్పుడు అచేతనంగా పడి ఉండడంతో సమాచారం ఇవ్వడంతో పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96833 కు సమాచారం అందించాలని కోరారు.

వంట గ్యాస్ పక్కదారి





ఒక దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన గృహావసర వంటగ్యాస్ సిలిండర్లు

ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు విజిలెన్స్, పౌర సరఫరాల శాఖల అధికారులు ఈనెల 5న ధర్మవరం పట్టణంలోని ఒక దుకాణంపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అక్రమంగా నిల్వ ఉంచిన హెచ్‌పీఎల్, భారత్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈసీయాక్ట్ 1955 సెక్షన్ 6(ఎ) కింద దుకాణం నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

- దుకాణాల్లో యథేచ్ఛగా రీ-ఫిల్లింగ్ దందా
- జిల్లాలో రోజూ 1,000 సిలిండర్ల అక్రమ డెలివరీ
- నెలసరి అక్రమ వ్యాపారం రూ.24 లక్షలు పైమాటే

జిల్లాలో డొమెస్టిక్ వంట గ్యాస్ కనెక్షన్లు	7,65,246
రోజువారీ డెలివరీ అవుతున్న సిలిండర్లు	రూ.12 వేలు
బ్లాక్‌లో డెలివరీ అవుతున్న సిలిండర్లు దాదాపు	రూ.1,000
బ్లాక్‌లో సిలిండర్ ధరపై అదనపు వసూలు	రూ.200
రోజువారీ అక్రమ సంపాదన	రూ. 2 లక్షలు
నెలవారీ అక్రమ సంపాదన	రూ.60 లక్షలు
ఫిల్లింగ్ స్టేషన్‌లో కిలో వంట గ్యాస్ ధర	రూ.100 నుంచి రూ.150

అనంతపురం అర్బన్: జిల్లాలో గృహావసర వంట గ్యాస్ పక్కదారి పడుతోంది. అక్రమ రీ ఫిల్లింగ్ దందా జోరుగా సాగుతోంది. వంటగ్యాస్ స్టవ్‌ల విక్రయాలు, రిపేర్లు, చిన్న సిలిండర్ల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఆ మాటున అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. కస్టమర్ అవసరాన్ని బట్టి కిలో గ్యాస్ ధర రూ.100 నుంచి రూ.150తో రీఫిల్ చేసి ఇస్తున్నట్లు తెలిసింది. ఈ అక్రమ వ్యాపారం విలువ జిల్లాలో నెలసరిగా రూ.60 లక్షల పైగానే ఉంటోందనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే అక్రమ దందాకు అడ్డుకట్టపడుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వినవస్తున్నాయి.

బ్లాక్‌లో కొనుగోలు...

ఫిల్లింగ్ దుకాణాల వ్యాపారులు గృహావసర వంట గ్యాస్ 14.2 కిలోల సిలిండర్‌ను డెలివరీ బాయ్స్ నుంచి బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారు. అలా కొన్న సిలిండర్ నుంచి గ్యాస్‌ను చిన్న సిలిండర్లకు కిలో రూ.100 నుంచి రూ.150 ధరతో నింపి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రధానంగా అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో అక్రమంగా వంటగ్యాస్ రీ-ఫిల్లింగ్ దందా సాగుతున్నప్పటికీ అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

అదనంగా వసూళ్లు..

జిల్లాలో గృహావసర వంటగ్యాస్ కనెక్షన్లు 7,65,246 ఉన్నాయి. ప్రతి రోజు 12,000 సిలిండర్లు డెలివరీ అవుతుంటాయి. వీటిలో ప్రతి రోజూ దాదాపు 1,000 సిలిండర్లు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డెలివరీ బాయ్‌లు రీ-ఫిల్లింగ్ దుకాణాలు, హోటళ్లు, టీస్టాళ్లకు కూడా గృహావసర వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తూ బిల్ ధరపై బ్లాక్‌లో రూ.200 అదనంగా డెలివరీ వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో సిలిండర్‌పై రూ.200గా వెయ్యి సిలిండర్లపై రోజువారీ అక్రమార్జన రూ.2 లక్షలుగా నెలసరి రూ.60 లక్షల బ్లాక్ దందా సాగుతోంది. ఏజెన్సీల్లో పనిచేస్తున్న డెలివరీ బాయ్స్‌లో కొందరు బహుళ కనెక్షన్లు కలిగి ఉన్నట్లు సమాచారం. కొందరు బాయ్‌లు వారి పేరున, వారి కుటుంబ సభ్యుల పేరున కనెక్షన్లు కలిగి ఉన్నట్లు తెలిసింది. వాటి ద్వారా సిలిండర్లను పొందిన అనంతరం బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నాశనం

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహిస్తున్న కూటమి సర్కార్
- విద్యా సదస్సులో ఎమ్మెల్సీ గోపిమూర్తి ధ్వజం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి

ఉరవకొండ: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా విద్యావ్యవస్థ నాశనమైందని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలతో పూర్తిగా భ్రష్టుపట్టిందని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి ధ్వజమెత్తారు. ఉరవకొండలోని గవిమఠం వెనుక ఉన్న సీవీవీ నగర్‌లో యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షుడు రామప్ప చౌదరి అధ్యక్షతన నిర్వహించిన విద్యాసదస్సులో గోపి మూర్తి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యారంగంలో ఏదో ఒక సంక్షోభాన్ని ఎదుర్కొంటూనే ఉందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టం పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం గణనీయంగా పడిపోయేలా చేశారన్నారు. రాష్ట్రంలో 9 రకాల పాఠశాలల నిర్వహణ లాంటి అశాస్త్రీయ కార్యక్రమాలతో తీవ్ర గందరగోళానికి తెర లేపారన్నారు. రాష్ట్రంలో 4వేల పాఠశాలల్లో సున్నా అడ్మిషన్లు ఉన్నాయంటే ఇందుకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టకుండా యోగా డే, మెగా పేరెంట్స్ డే అంటూ వారాల పాటు కార్యక్రమాలు నిర్వహించి ఫొటోలు తీయడం, అప్‌లోడ్ చేయడమే పనిగా ఉపాధ్యాయులను ఆదేశించడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్సీ యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరావు, డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఆవిర్భావం, విధివిధానాలను వివరించారు. యూటీఎఫ్ అలుపెరుగని పోరాటాల ఫలితంగా ఉపాధ్యాయ సమస్యలు విజయవంతంగా పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో వజ్రకరూరు ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య, పూర్వ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, విద్యావేత్త షాషావలి, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని బాలుడి మృతి



కార్తీక్ (ఫైల్)

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామానికి చెందిన వీరాంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఆదివారం ఉదయం పెద్ద కుమారుడు కార్తీక్ (5)ను పిలుచుకుని రోడ్డు పక్కన ఉన్న తోటలోకి వెళ్లారు. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమై ఉండగా.. కార్తీక్ రోడ్డుపైకి చేరుకున్నాడు. అదే సమయంలో రంగచేడు వైపు నుంచి చంద్రశేఖర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం వేగంగా వెళుతూ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబసభ్యులు చిన్నారి మృతదేహాన్ని హత్తుకుని గుండెలవిసేలా రోదించారు. ఘటనపై రాయదుర్గం రూరల్ పోలీసుల దర్యాప్తు చేపట్టారు.

శతాధిక వృద్ధురాలి మృతి



లక్ష్మీదేవమ్మ (ఫైల్)

కూడేరు: మండలంలోని ఇప్పేరుకు చెందిన అచ్యుత బాలయ్య సతీమణి లక్ష్మీదేవమ్మ (102) కన్నుమూశారు. ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బెంగళూరులో కుమారుడి వద్ద ఉంటున్న ఆమె వయోభారంతో ఆదివారం మృతి చెందారు.

ఉచిత బస్సు.. తుస్సు

- సరిహద్దు గ్రామాల మహిళలకు నిరాశ
- గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రయోజనం శూన్యం



బొమ్మనహాళ్ మీదుగా వెళుతున్న అంతర్రాష్ట్ర సర్వీసు బస్సు

బొమ్మనహాళ్: ఉచిత బస్సు ప్రయాణం గ్రామీణ ప్రాంత మహిళలకు వర్తించడం లేదు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో లాంటి ఐదు రకాల బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కర్ణాటక సరిహద్దున ఉన్న బొమ్మనహాళ్ మండలంలోని గ్రామాల మహిళలకు తీరని కలగానే మిగులుతోంది. బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ గ్రామాల్లో ఉన్న బ్యాంకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు, కళ్యాణదుర్గంలో ఉన్న ఆర్డీటీ ఆస్పత్రికి రోజూ మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ మార్గంలో తిరిగే బస్సులన్నీ పొరుగున ఉన్న కర్ణాటకకు వెళ్లి వస్తుంటాయి. మండలంలోని గోనేహాళ్, క్రాస్ నుంచి బొమ్మనహాళ్‌కు వెళ్లాలంటే మహిళలు టికెట్ తీసుకోవాల్సిందేనని కండక్టర్లు అంటున్నారు. అంతర్రాష్ట్ర సర్వీసు బస్సులకు ఉచిత ప్రయాణం కల్పించలేదని స్పష్టం చేస్తున్నారు. బొమ్మనహాళ్ నుంచి కళ్యాణదుర్గం వెళ్లాలన్నా టికెట్ తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. ఉచిత బస్సు అంటూ కర్ణాటక ప్రాంత సరిహద్దున ఉన్న తమకు అన్యాయం చేశారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమనీయం.. రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న నేమకల్లు ఆంజనేయస్వామి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేష అలంకరణల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాక, పొరుగున ఉన్న కర్ణాటక నుంచి ముందే రోజే వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. భక్తులకు స్థానికులు సునీత, శివారెడ్డి ఆధ్వర్యంలో అన్న దానం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఆంజినేయస్వామి ఉత్సవమూర్తిని రథంపైకి చేర్చి.. గోవింద నామ స్మరణతో భక్తులు ముందుకు లాగారు. రాత్రి 7 గంటలకు నిర్వహించిన లంకా దహనం కార్యక్రమం అలరించింది. పూజల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఈఓ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం తాలూకా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పర్యవేక్షణాధికారి మున్వర్ బాషా తెలిపారు. అధ్యక్షుడిగా వెంకటాచలపతి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా ఆశ, కోశాధికారిగా ఫణికుమార్, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీకాంత్, హసీనాను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు లెక్కల శ్రీనివాసులు, మల్లికార్జున, విజయభాస్కర్‌రెడ్డి, నియాజ్, అల్లాబకాష్, తాడిపత్రికి చెందిన హరిబాబు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ

- ఇద్దరు యువకులకు గాయాలు





గాయపడిన యువరాజు, రాజు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. రాప్తాడు మండలం పాలవాయి గ్రామానికి చెందిన రాజు, యువరాజు అనే యువకులు ద్విచక్ర వాహనంలో మామిళ్లపల్లి బస్టాండ్ సర్కిల్‌లో రోడ్డు దాటుతుండగా.. ధర్మవరం వైపు నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు యువకులు కింద పడటంతో గాయపడ్డారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేద జంటకు వివాహం

అనంతపురం కల్చరల్: గుంటూరు జిల్లాకు చెందిన గోపీనాథ్, అనంతకు చెందిన జయలక్ష్మి ఆదివారం స్థానిక గుత్తి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో ఒకటయ్యారు. నిరుపేదల వివాహానికి పట్టువస్త్రాలు, బంగారు మాంగళ్యం, ఒడి బియ్యం ట్రస్టు వారు సమకూర్చారు. రుక్మిణీదేవి రూ.50 వేలు అందజేయగా.. జీఎల్ మురళీధర్ ఉచిత భోజన వసతి కల్పించారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 104 ఉచిత వివాహాలు జరిపించామని తెలిపారు. అనంతరం అందరికీ తులసి మొక్కలు పంపిణీ చేశారు.

ఆర్టీటీ కోసం పోరాటం చేద్దాం

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్టీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేపడదామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని వెళ్లి.. అక్కడ ఏం చర్చించారో కూడా చెప్పడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన చర్చ వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీటీని కాపాడుకునేందుకు అందరు ఐక్యతగా ముందుకు రావాలన్నారు. లేకపోతే ఆర్టీటీ దూరం అవుతుందన్నారు. ఆందోళన చేసేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సుగమంచి శ్రీనివాసులు, కేపీ రాజు, ఆనంద్, కేవీ సుందరం, రామకృష్ణ, సుధాకర్, నరసింహులు, గణేష్, నరేంద్ర, శ్రీధర్, నరసయ్య పాల్గొన్నారు.

నడిమి వంకకు సైడ్‌వాల్ నిర్మించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నగర కమిటీ నాయకులు

అనంతపురం అర్బన్: స్థానిక తిక్కరంగయ్య స్వామి గుడి నుంచి తపోవనానికి వెళ్లే రహదారికి మరమ్మతులు చేయించి, నడిమివంకకు సైడ్‌వాల్ నిర్మించాలని సీపీఎం నగర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నడిమివంక ప్రాంతంలో నిరసన తెలిపారు. స్థానిక శాంతి నగర్ నుంచి తపోవనం వరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. తపోవనానికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది గురవుతునారన్నారు. రిషిత స్కూల్ వద్ద బ్రిడ్జి పాడై ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. దీని స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని కోరారు. నడిమి వంకకు సైడ్‌వాల్ లేక పోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రిషిత పబ్లిక్ స్కూల్ సమీపంలో బ్రిడ్జి వద్ద రిలే దీక్షలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, వలి, రాజు, జీవ, గఫూర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చీకటి పడితే భయం.. భయం

- గణేష్ నగర్‌లో వెలగని వీధి దీపాలు
- అధికమైన తాగుబోతుల బెడద
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న మహిళలు
- పట్టించుకోని అధికారులు



వీధిలైట్లు లేక చీకటిగా ఉన్న బళ్లారి రోడ్డు నుంచి గణేష్ నగర్‌కు వెళ్లేదారి (కరెంటు ఆఫీస్ పక్కన)

రాప్తాడురూరల్: నగరానికి కూతవేటు దూరంలో ఉన్న బళ్లారి రోడ్డు నుంచి గణేష్ నగర్ (కరెంటు ఆఫీస్ పక్కన)కు వెళ్లేదారి పగటి పూట నిత్యం రద్దీగా ఉంటుంది. గణేష్ నగర్, పాపంపేట, విద్యారణ్య నగర్ తదితర ప్రాంతాల నుంచి రోజూ వందలాది మంది బళ్లారి రోడ్డు వైపు వెళ్లాలంటే ఈ మార్గం గుండా వెళ్తుంటారు. సాయంత్రం చీకటి పడితే ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని భయం భయంగా వెళ్లాల్సిందే. వీధి లైట్లు వెలగవు.. తాగుబోతులు రోడ్డు పక్కనే బైకులు నిలబెట్టి మద్యం తాగుతుంటారు. ఈ రోడ్డుపై వెళ్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మహిళలు భయం.. భయంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అటు పంచాయతీ అధికారులు కానీ, ఇటు పోలీసులు కూడా పట్టించుకోకపోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ ప్రాంతం నారాయణపురం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఇంత రద్దీగా ఉండే ఈ దారిలో కనీసం వీధిలైట్లు వెలగవు. సాయంత్రం అయితే చీకటి కమ్ముకుంటుంది. ఇదే సమయంలో తాగుబోతులు రెచ్చిపోతున్నారు. ఇటీవల ఈ దారి పక్కనే మద్యం తాగుతున్న యువకులు వారిలో వారే గట్టిగా అరుచుకుంటూ అటుగా వెళ్తున్న వారిపై కేకలు వేయడంతో బైకులో వెళ్తున్న జంట భయపడి స్పీడుగా వెళ్లిపోయింది. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

భరించలేని దుర్వాసన

రోడ్డు పక్కన పెద్ద డ్రైనేజీ ఉంది. చుట్టుపక్కల హోటళ్లతో పాటు కొందరు మిగిలిపోయిన వ్యర్థాలన్నీ ఈ కాలువలో వేస్తున్నారు. దీనికి తోడు చనిపోయిన కుక్కలు, పందులు, ఆవుల కళేబరాలను వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ వాసన భరించలేక సమీపంలోని నివాసాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు వేస్తున్న వారిని ప్రశ్నిస్తే.. 'ఇది మీ ఇల్లా.. కాలువలో వేస్తే మీకేం ఇబ్బంది' అంటూ తిరబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ అధికారులు, పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్మోగిన శ్రీకృష్ణ నామస్మరణ

- ఇస్కాన్‌లో ముగిసిన కృష్ణాష్టమి సంబరాలు
- ఉడుపి శ్రీకృష్ణ మఠంలో ఆకట్టుకున్న రథోత్సవం
- హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్న మహిళలు



చిన్నారితో ఉట్టి కొట్టిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మూడు రోజులుగా కనుల పండువగా సాగిన ఇస్కాన్ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మందిరంలో శ్రీకృష్ణ నామస్మరణ మార్మోగింది. చివరి రోజు ఇస్కాన్ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదుల జయంతి నిర్వహించారు. సజీవ శిల్పంగా చూపురులను ఆకర్షించే ప్రభు పాదుల విగ్రహానికి చందన పుష్పాలంకార సేవలు, ఆలయంలోని రాధా పార్థసారథులను విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు నేతృత్వంలో సామూహిక భజన చేశారు.

ఆకట్టుకున్న గోపికలు, చిన్ని కృష్ణులు

పాతూరులోని బ్రహ్మకుమారీల సెంటర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సంబరంగా సాగాయి. చిన్నారులు శ్రీకృష్ణులు, గోపికల అలంకరణలో ఆకట్టుకున్నారు. బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జి సిస్టర్ శారద, అతిథిగా విచ్చేసిన యోగాగురువు మురళీకృష్ణ జన్మాష్టమి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.

పురవీధుల్లో రథోత్సవం..

మూడవ రోడ్డులోని ఉడుపి శ్రీకృష్ణ మఠంలో మధ్వ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఉదయం పంచామృతాభిషేక సహిత అలంకార సేవలు, సాయంత్రం మహారథోత్సవం నిర్వహించారు. మఠం మేనేజర్ లక్ష్మీ నారాయణాచార్ నేతృత్వంలో పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై చిన్ని కృష్ణుడిని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అడుగడుగునా హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మూడవ రోడ్డు నుంచి మొదటి రోడ్డు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆలయం వరకు సంకీర్తనలు ఆలపించారు.

అత్యవసరమైతే అంతే..

- జీజీహెచ్‌లో ప్రమాదకర కేసులపై నిర్లక్ష్యం
- సీటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ చేయడంలో జాప్యం
- ఇటీవల సీటీ స్కాన్‌కు వచ్చి ఓ వృద్ధుడి మృతి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



సర్వజనాస్పత్రిలో సీటీ స్కాన్

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో సర్వజనాస్పత్రిలో నాణ్యమైన సేవలు రోగులకు దూరమయ్యే దారుణమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల బుక్కరాయసముద్రం గాంధీనగర్‌కు చెందిన కృష్ణమూర్తి (75)కి సకాలంలో సీటీ స్కాన్ చేయకుండా స్కాన్ నిర్వాహకులు నిర్లక్ష్యం చేసిన విషయం విదితమే. కొత్తగా సర్వజనాస్పత్రిలోని ఎంఎస్–1లో ఈనెల 11న ఓ 50 ఏళ్ల వ్యక్తి (ఆర్‌టీఏ కేసు) అడ్మిట్ అయ్యాడు. కాగా అదే రోజున సర్జన్లు సీటీ స్కాన్‌కు రెఫర్ చేశారు. కానీ ఆ రోజు రాత్రి స్కాన్ చేయలేదు. ఈనెల 12న సదరు వ్యక్తి స్కాన్ చేశారు. ఇలా ఆస్పత్రిలో స్కాన్ తీవ్ర జాప్యం జరుగుతోంది. అందులోనూ రేడియాలజీ విభాగం సిటీ, ఎంఆర్‌ఐ స్కాన్లు చేయించుకునే అడ్మిషన్‌లో ఉన్న పేషంట్లను రోజూ ఉదయం 10 గంటల నుంచి 12, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు మాత్రమే పంపాలంటూ సర్క్యులర్ విడుదల చేశారు. దీంతో అడ్మిషన్‌లో ఉన్న ప్రమాదకర కేసుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సర్వజనాస్పత్రిలో రోజు రోజుకు నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఎక్కడైనా అత్యవసర కేసులకు సకాలంలో స్కాన్ చేయకుండా ఆంక్షలు విధించడం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు మేలుకుని ప్రమాదకర కేసులకు సత్వరమే స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మోసం.. చంద్రబాబు నైజం



కూటమి వైఫల్యాలను వివరిస్తున్న నాయకులు

అనంతపురం రూరల్: 'చంద్రబాబు పాలనంతా అబద్ధాలు.. మోసాలే. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు ఆదివారం రుద్రంపేట పంచాయతీలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కూటమి వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాదిక్‌వలి, రుద్రంపేట ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 2024 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు.. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్న ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే ఆ పథకాలను సైతం నిలిపివేశారన్నారు. రుద్రంపేట పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, రమణారెడ్డి, బుల్లెట్ లక్ష్మారెడ్డి, విజయ్‌కుమార్, రామ్మూర్తి, చెన్నకేశవులు, ఖాజా, మహిళా నాయకురాళ్లు కృష్ణవేణి, అక్కమ్మ జయమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వీడాలి



పుస్తకావిష్కరణ చేస్తున్న రచయితలు

అనంతపురం కల్చరల్: మూఢనమ్మకాలను వదిలి, శాస్త్రీయమైన ఆచార వ్యవహారాలు పాటించాలని వక్తలు సూచించారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం సీనియర్ కవి ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన 'ఆచారాలు–సంప్రదాయాలు' పుస్తకావిష్కరణ జరిగింది. ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, శాంతినారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, జీఎల్ఎన్ ప్రసాద్ తదితరులు హాజరై మాట్లాడారు. సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలు అనేవి వివిధ కోణాల్లో జీవితాలను ప్రభావితం చేస్తాయన్నారు. కొన్ని మాత్రమే నమ్మదగినవి, శాస్త్రీయమైనవి ఉంటాయని తెలిపారు. వేటిని అనుసరించాలో తెలియజేసే ఈ అద్భుత పుస్తకాన్ని అందరూ చదవాలన్నారు. సమాజ మార్పుకు దారి తీసే దిశగా ఒక బలమైన ఆయుధంగా సాహిత్యాన్ని కవి ఉపయోగించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజారాం, యోగీశ్వర నాయుడు, సురేష్, రియాజుద్దీన్, మధురశ్రీ, ఈరన్న, బాషా, నర్సిరెడ్డి, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజల నుంచి ఆయా శాఖల అధికారులు అర్జీలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. అధికారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

నాగుల కట్టకు పూజలు

రాప్తాడు: మండలంలో శ్రావణ మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని నాగుల కట్టలు, పుట్టలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాప్తాడులో ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవాలయం, లక్ష్మీ పండమేటి రాయుడు దేవాలయం, షిర్డి సాయిబాబా దేవాలయం ప్రాంగణంలోని నాగుల దేవతల విగ్రహాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నాగుల ప్రతిమలకు పూజలు చేపట్టారు. పుట్టకు పసుపు కుంకుమలు, తోరాలు (పసుపు పూసిన పచ్చిదారాలు) అలంకరించి పాలు పోసి చలివిడి ముద్దలు, నూగుల ముద్దలు ప్రసాదంగా ఉంచారు. కుటుంబాలు చల్లగా చూడాలని నాగ దేవతలను వేడుకున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలే ఆహారం



విద్యుత్ నగర్ నుంచి నాయక్‌నగర్‌కు వెళ్లే మార్గంలో చెత్తకుప్పల వద్ద ప్లాస్టిక్, చెత్తను తింటున్న గోవులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం.. పశువుల పెంపకందారుల బాధ్యతారాహిత్యం గోవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనుంది. జిల్లా కేంద్రంలోని వివిధ డివిజన్లలో పశువులు భారీగా సంచరిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వివిధ కూడళ్లలో చెత్త దిబ్బల్లోని వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను పశువులు తింటున్నాయి. ఇటువంటి ప్లాస్టిక్, వ్యర్థాలను తీసుకోవడం ద్వారా అవి ఇచ్చే పాలతో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. గోవులు మంచి పశుగ్రాసం తీసుకుంటేనే పాలు సమృద్ధిగా ఇస్తాయి. అటువంటిది పెంపకందారులు గోవులను రోడ్లపైకి వదిలేశారు. నగరపాలక సంస్థ అధికారులు నోటీసులతో సరిపెట్టి ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మేలుకుని తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోటంకలో 'శ్రావణ' పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శ్రావణ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పంపనూరుకు 'శ్రావణ' శోభ



పూజల్లో పాల్గొన్న భక్తులు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



పూజలందుకున్న పార్వతీ దేవి

ఆత్మకూరు: శ్రావణ మాసం చివరి ఆదివారం పంపనూరుకు భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి స్వామి దర్శనానికి వేల సంఖ్యలో తరలివచ్చారు. తొలుత సుబ్రహ్మణ్యేశ్వర, మంజునాథ, పార్వతీ దేవికి అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆకుపూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాగంణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. వేల సంఖ్యలో భక్తులు రావడంతో స్వామి దర్శనానికి గంటల సమయం పట్టింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డెక్కిన విద్యుత్ స్తంభాలు

నగరంలోని సోమనాథ్ నగర్ నుంచి యువజన కాలనీకి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. సీసీ రోడ్డు వేసే క్రమంలో విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చలేదు. స్తంభాల మధ్యలోనే సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాలనీలో ప్రజల ఇళ్ల వద్దకు ఆటో వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోయింది. ఇంటి వద్దకు వెళ్లాలంటే రెండు మూడు వీధులు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికార యంత్రాంగం కనీస అవగాహన లేకుండా సీసీ రోడ్డు ఏర్పాటు చేశారని యువజన కాలనీ ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

– అనంతపురం టౌన్:



సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

జైనబ్బీ ఉరుసు ఉత్సవాలకు పటిష్ట భద్రత



ఉరుసు ఏర్పాట్లపై దర్గా కమిటీ సభ్యులతో చర్చిస్తున్న సీఐ మహానంది

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అర్బన్ సీఐ మహానంది తెలిపారు. ఆదివారం దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లపై సీఐ చర్చించారు. ఈసందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 23 వరకు జరిగే ఉరుసు ఉత్సవాలకు పోలీసుల సహకారం ఎంతో అవసరం అన్నారు. సీఐ మాట్లాడుతూ గంధం వేడుకల ఊరేగింపులో పోలీసులను అన్ని ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు జెండా జిలాన్, జీఎంఎస్ షాకీర్, మైనుద్దీన్, శర్మాస్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్స్ అందజేత



జవాన్ గణేష్‌కు పర్స్ అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడు (బీఎస్‌ఎఫ్ జవాన్) పోగుట్టుకున్న పర్స్‌ను అందజేసి సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే..ఆర్టీసీ బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ బాబామున్వర్‌కు ఓ పర్స్ దొరికింది. పర్స్‌లో చెక్ చేయగా రూ.6 వేల నగదుతోపాటు ఐడీ కార్డు ఉంది. ఐడీ కార్డు ద్వారా కర్నూలు జిల్లా చిప్పగిరికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ కేఎస్ గణేష్‌గా గుర్తించారు. చిప్పగిరిలోని హెడ్‌కానిస్టేబుల్ స్నేహితుల ద్వారా గణేష్ సెల్ నంబర్ సేకరించి గుంతకల్లుకు రప్పించి పర్స్ అందజేశారు. బీఎస్‌ఎఫ్ జవాన్ తన కుటుంబసభ్యులుతో కలిసి గుత్తికి వెళ్లడానికి గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన సమయంలో పర్స్‌ను మిస్ చేసుకున్నట్లు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్‌కు జవాన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్రీ బస్సు.. అంతా తుస్సు



వర్షంలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న మహిళలు

రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి రాగానే మహిళలను నిండా ముంచేసింది. తూతూమంత్రంగా 5 రకాల బస్సుల్లో మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం కల్పించింది. మహిళలకు సరిపడా బస్సులు కేటాయించక పోవడంతో ప్రయాణం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో వచ్చారు. బస్సులు నిండిపోవడంతో కొంత మంది నిలబడ్డారు. మరికొంత మంది ఫుట్‌బోర్డు వద్ద నిల్చుని ప్రయాణించారు. దైవ దర్శనానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఉచిత బస్సు పథకంతో ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య పడిపోతోంది. సీఎం చంద్రబాబు తమ పొట్టకొట్టారంటూ ఆటో డ్రైవర్లు బహిరంగంగా మండిపడుతున్నారు. ఆర్టీసీ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా గణనీయంగా పడిపోనుంది.

– ఆత్మకూరు:



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న దృశ్యం